వుదయం

www.voodayam.com

భూ రీ సర్వేను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పని చేయాలని స్పష్టం చేశారు.

రీసర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని అలాగే కలెక్టర్లు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణం ఎంత? రీసర్వే అనంతరం గుర్తించిన విస్తీర్ణం ఎంత? అనే వివరాలను భూయజమానులకు తక్షణమే తెలియజేయాలని ఆదేశించారు. భూ యజమానులకు ఎలాంటి సందేహాలు, అపోహలు లేకుండా సర్వే ప్రక్రియపై పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ లతో కలిసి

జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులతో రీసర్వే, హౌసింగ్ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సర్వేలో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అభినందనలు.. నిజామాబాద్‌పై అసంతృప్తి

రీసర్వే నిర్వహణలో వెనుకబడిన జిల్లాలు పనితీరును మెరుగుపరుచుకొని నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అర్హులైన పేదలకు త్వరితగతిన లబ్ధి చేకూర్చాలని మంత్రి ఆదేశించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను తక్షణమే గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు.

2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

రెండు పడక గదుల (2బీహెచ్‌కే) ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నప్పటికీ, ఆయా ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లను తక్షణమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. 22ఎ భూముల సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి 22ఎ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ కొన్ని జిల్లాల్లో ఇంకా సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే, గృహ నిర్మాణం, 22ఎ భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వేగం, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వి సి.కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ,ఆర్.డి.ఓ నవీన్,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. అశోక్ పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ

ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ - 11

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆజాద్ విద్యా రంగానికి చేసిన సేవలు, ఆయన ఆలోచనలు, పోరాట పటిమ ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారన్నారు. ఐఐటీ, ఐఐఎస్సీ, యూజీసీ, సాహిత్య అకాడమీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటులో అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరవరానిదని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు, సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆజాద్ అన్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. రామ్మూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ఆజాద్‌కి నివాళులర్పించారు.

అమెరికాలో.. అంగన్వాడి!

- టీచర్ లేక మూతపడిన బత్తులపల్లి అంగన్వాడీ కేంద్రం
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న చిన్నారులు, గర్భిణులు
- దీర్ఘకాలిక సెలవులకు అనుమతులిచ్చిందెవరు?
- కేంద్రాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్తుల వేడుకోలు

కల్లూరు నవంబర్ 11(వుదయం ప్రతినిధి):



గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యకు అండగా నిలవాల్సిన అంగన్వాడీ కేంద్రం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. బత్తులపల్లిలోని అంగన్వాడీ కేంద్రం టీచర్ అందుబాటులో లేకపోవడంతో మూతపడిన పరిస్థితి నెలకొంది. దీంతో కేంద్రంపై ఆధారపడిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ సంక్షేమ సేవలకు దూరమవుతున్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య పర్యవేక్షణతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన పోషకాహార సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే బాధ్యతాయుతమైన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఈ సేవలన్నీ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమెరికాలో ఉద్యోగమా.. గ్రామంలో కేంద్రం మూతా?

అంగన్వాడీ టీచర్ దీర్ఘకాలికంగా విధులకు దూరంగా ఉండటంతో కేంద్రం నిర్వహణ అటకెక్కిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాల్సిన సిబ్బంది సుదీర్ఘకాలం అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? సెలవులకు అనుమతులు ఎవరు ఇచ్చారు? ఇచ్చిన అనుమతుల కాలపరిమితి ఎంత? ఆ సమయంలో కేంద్రాన్ని నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించిన ఎందుకు తెరవలేకపోతున్నారు.అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమా?

ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్తు, మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్వాడీ వ్యవస్థకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే ఆ లక్ష్యాలు ఎలా నెరవేరుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక కేంద్రం మూతపడటం అనేది కేవలం ఒక గది తాళం వేయడమే కాదు.. దానిపై ఆధారపడిన చిన్నారుల పోషకాహారం, విద్య, మహిళల ఆరోగ్య సేవలకు ఆటంకం కలగడమేనని గుర్తించాల్సిన అవసరం ఉంది.

అధికారులు స్పందించాలి.. కేంద్రాన్ని తెరవాలి

బత్తులపల్లి అంగన్వాడీ కేంద్రం పరిస్థితిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. టీచర్ సెలవులపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించి కేంద్రాన్ని వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ సేవలు ప్రజలకు అందాల్సిన సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం బాధాకరమని, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి న్యాయం చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

కార్తీక మాసం ఆధ్యాత్మిక వైభవం.. అయ్యప్ప మాలధారణతో భక్తిభావం



నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 11,(వుదయం ప్రతినిధి):

శివకేశవుల ఆరాధనకు అత్యంత పవిత్రమైన మాసం కార్తీకం.. నియమ నిష్ఠలు, భక్తి శ్రద్ధలతో అయ్యప్ప దీక్షకు శ్రీకారం.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక కథనం:

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. సంవత్సరంలోని పన్నెండు మాసాల్లో కార్తీక మాసాన్ని అత్యంత పవిత్రమైన మాసంగా భక్తులు భావిస్తారు. ఈ మాసం శివకేశవుల ఆరాధనకు విశిష్టమైనదిగా పురాణాలు పేర్కొంటున్నాయి. కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించడం, శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు, ఉపవాసాలు, వ్రతాలు నిర్వహించడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

కార్తీక మాసం విశిష్టత

కార్తీక మాసంలో ప్రతి రోజు ప్రత్యేకమైనదే అయినప్పటికీ సోమవారాలు, కార్తీక పౌర్ణమికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ మాసంలో శివాలయాలను దర్శించుకోవడం, మారేడు దళాలతో పరమశివుడిని పూజించడం, దీపాలు వెలిగించడం, నదులు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరించడం సంప్రదాయంగా వస్తోంది. ముఖ్యంగా కార్తీక దీపారాధనకు విశేష ప్రాముఖ్యత ఉంది. ఇంటి ముందు, తులసి కోట వద్ద, ఆలయాల్లో దీపాలు వెలిగించడం ద్వారా అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ మాసం అందిస్తుంది.

అయ్యప్ప మాలధారణతో దీక్షా జీవితం ప్రారంభం

కార్తీక మాసం ప్రారంభంతో అయ్యప్ప స్వామి భక్తుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. స్వామియే శరణం అయ్యప్ప అనే శరణుఘోషతో భక్తులు మాలధారణ చేసి 41 రోజుల మండల దీక్షకు శ్రీకారం చుడతారు. గురుస్వాముల సమక్షంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తులసి లేదా రుద్రాక్ష మాలను ధరించడం ద్వారా దీక్షను ప్రారంభిస్తారు. మాలధారణ చేసిన భక్తులు స్వామివారిని స్మరిస్తూ నియమ నిష్ఠలతో జీవనం సాగిస్తారు.

నియమ నిష్ఠలే దీక్షకు ప్రాణం

అయ్యప్ప దీక్షలో కేవలం మాల ధరించడమే కాకుండా ఆచరణలోనూ పవిత్రతను పాటించడం ప్రధానమైనది. బ్రహ్మచర్యం, సాత్విక ఆహారం, మద్యపానం, మాంసాహారానికి దూరంగా ఉండటం, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్నానాలు ఆచరించి పూజలు చేయడం, నిత్యం అయ్యప్ప నామస్మరణ చేయడం దీక్షలో ముఖ్యమైన నియమాలు. నల్లటి లేదా నీలం రంగు వస్త్రాలు ధరించడం, పాదరక్షలు ఉపయోగించకుండా నడవడం, కోపతాపాలకు దూరంగా ఉండటం, సత్యం మాట్లాడటం, ఇతరులను గౌరవించడం వంటి నియమాలను భక్తులు పాటిస్తారు. దీక్షలో ఉన్న ప్రతి ఒక్కరినీ స్వామిగా సంబోధించడం అయ్యప్ప సంప్రదాయంలోని గొప్ప సమానత్వ భావనకు నిదర్శనం. కుల, మత, ఆర్థిక భేదాలకు అతీతంగా అందరూ ఒకే భావనతో స్వామి సేవలో పాల్గొంటారు. సేవాభావం, సహనం, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం వంటి సద్గుణాలను ఈ దీక్ష అలవర్చుతుంది.

ఇరుముడి.. శబరిమల యాత్రలో అత్యంత పవిత్రం

ఇరుముడిలో నెయ్యితో నింపిన కొబ్బరికాయతో పాటు పూజా సామగ్రిని ఉంచుతారు. శబరిమలలోని పద్దెనిమిది పవిత్ర మెట్లను ఇరుముడితో అధిరోహించి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం భక్తుల జీవితంలో అత్యంత పవిత్రమైన ఘట్టంగా భావిస్తారు. నెయ్యాభిషేకం ద్వారా భక్తులు తమ భక్తిశ్రద్ధలను స్వామివారికి సమర్పిస్తారు.

గంగపుత్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట!

గంగపుత్రుల వాస్తవ జనాభా 5.85 లక్షలుగా గుర్తింపు

ముషీరాబాద్, నవంబర్ 11 (వుదయం):



గంగపుత్రుల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గంగపుత్రుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు ఎకరాల భూమితో పాటు రూ.5 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు నాయకులు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంగపుత్రుల జనాభాను తక్కువగా చూపించడంతో ఆ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గంగపుత్రుల వాస్తవ జనాభా వివరాలను ప్రభుత్వం, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా, ప్రస్తుతం వారి జనాభాను 5 లక్షల 85 వేలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు.

ఈ సందర్భంగా సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంగపుత్రుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన గంగపుత్ర సంఘాల జిల్లా చైర్మన్లు, డైరెక్టర్లు, ఫిషరీస్ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గంగపుత్రులకు ఏ సమస్య ఎదురైనా ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ యాదగిరి, ఏఐసీసీ నేషనల్ సెక్రటరీ బిజ్జి శత్రురావుతో పాటు బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ తదితర ప్రముఖులు హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన గంగపుత్ర సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ అల్లం బుచ్చమ్మకు నివాళులు



పెద్దపల్లి, నవంబర్ 11: వుదయం ప్రతినిధి

తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాతృమూర్తి కామ్రేడ్ అల్లం బుచ్చమ్మ ఇటీవల పరమపదించిన విషయం తెలిసిందే. కాగా బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం గాజులపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వజ్జె వీరయ్య యాదవ్, ఐజేయూ సంఘ జాతీయ నాయకులు అవాని భాస్కర్, రాష్ట్ర నాయకులు డిఆర్ లెనిన్, సంఘ జిల్లా కోశాధికారి బొజ్జ ఎడ్వర్డ్, జిల్లా సహాయ కార్యదర్శి ఊటుకూరి రవీందర్, సంఘ నాయకులు బోయపల్లి శేఖర్ గౌడ్, సుందరం వెంకట్, నాగార్జున, రామాచారి తదితరులు. ఈ సందర్భంగా ఆమె కుమారులైన అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయణలకు బుచ్చమ్మ చిత్రపటాన్ని గుర్తింపుగా అందజేశారు.

రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్

- 2027-28 నుంచే పాఠశాలలో తరగతులు ప్రారంభించాలి
- నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

చిలుకూరు సెప్టెంబర్ 11:(వుదయం)



మండల పరిధిలోని సీతారాంపురం సమీపంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,2027-28 విద్య సంవత్సరం మొదలయ్యే లోగా పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులకు సిద్ధం చేయాలని మంత్రి అన్నారు, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందని తెలిపారు. పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ,అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు కీత వెంకన్న, కార్యదర్శి పిండ్రతి హనుమంతరావు, బేతవోలు సర్పంచ్ వట్టికూటి నాగయ్య, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక

అనంతగిరి, నవంబర్ 11



అనంతగిరి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇరుగు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.పాత్రికేయ రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ బాధ్యతలు చేపట్టిన ఇరుగు ప్రెస్ క్లబ్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడం పట్ల పలువురు పాత్రికేయ మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు, అధ్యక్షుడిగా ఇరుగు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా అల్లుచలం, ప్రధాన కార్యదర్శిగా మట్టపల్లి ఉపేందర్ గౌడ్, కోశాధికారిగా శ్రీరామ్ రవి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఇరుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్క పాత్రికేయ మిత్రుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి కేవలం హోదా మాత్రమే కాదని, పాత్రికేయుల ఐక్యతకు, గౌరవానికి, హక్కుల పరిరక్షణకు సంబంధించిన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతూ అనంతగిరి మండల ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన సీనియర్ పాత్రికేయులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు గుండ్లపల్లి వెంకన్న, బుర్ర పవన్,సోమగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులకు అండగా సండ్ర!



ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి.. పంట నష్టం సర్వే చేపట్టాలి

కల్లూరు నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) మురాను తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరిశీలించారు. కల్లూరు మండలంలోని లింగాల, పాత ఎర్రబోయినపల్లి, కొత్త ఎర్రబోయినపల్లి, చండ్రుపట్ల గ్రామాల్లో రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే పంట నష్టం సర్వే చేపట్టాలని, ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పరిహార నిబంధనలు సడలించి బాధిత రైతులందరినీ ఆదుకోవాలని కోరారు.

స్విమ్మర్స్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ షేక్ అతియ అంజుమాన్ జన్మదిన వేడుకలు

మధిర, నవంబర్,11, వుదయం, ప్రతినిధి:



మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షేక్ జానీ కుమార్తె డాక్టర్ షేక్ అతియ అంజుమాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి,బొగ్గుల శ్రీనివాసరెడ్డి,పల్లపోతుల ప్రసాద రావు,మునగాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సామాన్య కుటుంబానికి చెందిన షేక్ జానీ తన కుమార్తెను ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ చదివించి డాక్టర్‌గా తీర్చిదిద్దడం ఎంతో అభినందనీయమని,ప్రస్తుతం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో వైద్యురాలిగా సేవలందిస్తున్న డాక్టర్ ఇతిమా అంజుమాన్ తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు,కష్టాలు పడుతుంటారని,పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత తల్లిదండ్రుల ఆశయాలను గౌరవిస్తూ వారిని ప్రేమగా చూసుకోవడం, వారి కష్టాన్ని గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా చెరుకూరి కృష్ణారావు మొక్కను అందజేయగా,తూములూరి రాజా, కళ్యాణపు పున్నయ్య,షేక్ సుకూర్ కలిసి శాలువాతో డాక్టర్ ఇతిమా అంజుమాన్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జంగా నరసింహారెడ్డి,పల్లపోతుల ప్రసాద రావు,జంగా శ్రీనివాసరెడ్డి,చెరుకూరి కృష్ణారావు, తూములూరి రాజా, వెలివేల శ్రీధర్, కళ్యాణపు పున్నయ్య,చల్లసత్యనారాయణ, శీలం శ్రీనివాసరెడ్డి,షేక్ సుకూర్, షేక్ జానీ, మేడ గోపీనాథ్, కలర్స్ పాషా,మునగాల తిరుప తిరెడ్డి, శాఖ మూడి బ్రహ్మయ్య,మార్తా శ్రీనివాసరావు,మాచర్ల శ్రీనివాసరావు,ఏలూరు దుర్గాప్రసాద్, వై. నాగేశ్వరరావు,కొత్తూరి నరసింహారావు,వాసంశెట్టి జనార్దన్ రావు,వట్టే సైదులు, లింగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నీలం మధుకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి విజ్ఞప్తి

జిన్నారం నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



బీసీ వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని సీనియర్ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు, ఆదరణ కలిగిన బీసీ ముదిరాజ్ నాయకుడు నీలం మధుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నీలం మధు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. బీసీ వర్గాలు రాజకీయంగా మరింత ఎదగాలంటే చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించేలా నీలం మధుకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయనకు పదవి కల్పించడం ద్వారా బీసీ వర్గాల రాజకీయ భాగస్వామ్యానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

భూ పునఃసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

కామారెడ్డి, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):-



కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పోతారం గ్రామంలో బుధవారం భూ పునఃసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి హాజరై గ్రామ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, భూ పునఃసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే అధికారులు సమాచారం ఇచ్చిన వెంటనే రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర అవసరమైన భూ పత్రాలతో సర్వేకు హాజరై అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. రైతులందరూ సహకరిస్తే పునఃసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయవచ్చని తెలిపారు. భూ సరిహద్దుల విషయంలో స్పష్టత తీసుకురావడం, భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే పునఃసర్వే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, పాల్వంచ, మండల సర్వేయర్, గ్రామ పంచాయతీ అధికారి (GPO), పోతారం, భవానీపేట గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి


రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు

చిలుకూరు నవంబర్ 11:(వుదయం)



అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు ఉద్యమాల గడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నేపథ్యంలో మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.బుధవారం మండలంలోని కొండాపురం, బేతవోలు, మాదాగూడెం గ్రామాల్లో మహాసభల కరపత్రాలు పంపిణీ చేస్తూ, పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా, మేదరమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నల్లగొండ పట్టణంలో పదివేల మంది రెడ్ షర్ట్ వాలంటీర్లతో, లక్ష మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు మండల వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా రైతు ఉద్యమ నాయకులు, మేధావులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు ఈ జాతీయ మహాసభల్లో పాల్గొని వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, రైతుల హక్కులు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జె. నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి నాగేటి చినరాములు, బుడెగం రామారావు, సర్పంచ్ కత్తి బాబు, పిల్లి వీరమల్లయ్య, బత్తిని వెంకటయ్య, అలివేలు, లింగమల్లయ్య, కోటేశ్వరరావు, కిరణ్ వీరస్వామి, గుడిగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి




దండేపల్లి: నవంబర్ 11 (వుదయం విలేఖరి)

మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేట (కంచరబాయి)కి చెందిన బోయిన రెడ్డి (43) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దండేపల్లి ఎస్సై రాజవర్ధన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో బోయిన రెడ్డి అడవి ప్రాంతానికి వెళ్లగా, వన్యప్రాణుల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భర్త మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు.మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

హోంగార్డు ప్రోత్సాహం.. కుమార్తె ప్రతిభకు పతకం

- హోంగార్డు కుమార్తెకు కాంస్య పతకం.. జాతీయ స్థాయికి అర్హత
- 70వ రాష్ట్ర స్థాయి SGFI షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటిన అక్షిత

కామారెడ్డి, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):-



సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న HG-530 పెరమ్ స్వామి కుమార్తె పెరమ్ అక్షిత 70వ రాష్ట్ర స్థాయి SGFI షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పెరమ్ స్వామి, తన కుమార్తెలోని క్రీడా ప్రతిభను గుర్తించి, ఆమె ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సాహం అందించారు. తండ్రి అందించిన ప్రోత్సాహానికి తన కృషి, పట్టుదలను జోడించిన అక్షిత రాష్ట్రస్థాయిలో పతకం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించడం విశేషం. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి అక్షితను, ఆమె తండ్రి హోంగార్డు పెరమ్ స్వామిని ఆహ్వానించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఇద్దరిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.